ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ గెలుపు ఖాయం

పార్టీ మలక్‌పేట అభ్యర్థి షేక్ అక్బర్



వృద్ధురాలకి పార్టీ హామీలు వివరిస్తున్న షేక్ అక్బర్

సైదాబాద్: ఆరు గ్యారంటీల హామీలతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలవటం ఖాయమని పార్టీ మలక్‌పేట అభ్యర్థి షేక్ అక్బర్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సైదాబాద్, ఆస్మాన్‌ఘడ్‌లో పాదయాత్ర చేస్తూ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కరపత్రాలు ప్రజలకు పంచుతూ పార్టీ ఆరు గ్యారంటీల హామీలను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రచారంలో మలక్‌పేట ప్రజల నుంచి తమకు అపూర్వ ఆదరణ లభిస్తున్నదని అన్నారు. గత మూడు పర్యాయాలుగా మలక్‌పేటలో ఎంఐఎం నాయకులు నియోజకవర్గ వాసులను బెదిరిస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందారని అన్నారు. మజ్లిస్ ఆగడాలకు ఈ ఎన్నికల్లో మలక్‌పేట వాసులు తగిన బుద్ధి చెపుతారని, కాంగ్రెస్‌ను ఆదరించి తనను మంచి మెజారిటీతో గెలిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రచారంలో నాయకులు మదన్‌బాబు, గంట్ల కృష్ణ, చక్రపాణి పాల్గొన్నారు.

ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో...

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం శంకర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడారు.

అభివృద్ధి కావాలా.. అణచివేత కావాలా?

బీజేపీ యాకుత్‌పురా అభ్యర్థి వీరేందర్ యాదవ్



తనకు ఓటు వేయాలని ఓ అవ్వను బతిమిలాడుతున్న వీరేందర్‌యాదవ్

చంచల్‌గూడ: గత 70 సంవత్సరాల నుంచి యాకుత్‌పురా నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని బీజేపీ అభ్యర్థి ఎన్. వీరేందర్ యాదవ్ అన్నారు. ఆయన శనివారం రాత్రి కుర్మగూడ డివిజన్ సాయిలాల్‌తోట, ఉప్పరిగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటు వేస్తే ప్రయోజనం ఉంటుందని, అభివృద్ధి కావాలో...అణచివేత కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. ప్రచారంలో మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, నాయకులు తంగెళ్ల సుధీర్, నిరంజన్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, దశరథ లక్ష్మి, నాగరాజు, అజయ్, జగన్, ప్రమోద్, శంకర్ తదితరులున్నారు.

ఐఎస్‌సదన్ డివిజన్‌లో

సైదాబాద్: యాకుత్‌పురా అభ్యర్థి వీరేంద్ర యాదవ్ ఆదివారం బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి తదితరులతో కలిసి ఐఎస్‌సదన్ డివిజన్‌లోని వినయ్‌నగర్, లక్ష్మీనగర్ కాలనీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మలక్‌పేటలో కమల వికాసం తథ్యం

బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి



మూసారంబాగ్: ప్రచారంలో సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: నియోజకవర్గంలో కమలం పువ్వు వికసించడం ఖాయమని మలక్‌పేట బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్, ఓల్డ్ మలక్‌పేట డివిజన్లలో ఆదివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి ఈ ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో మజ్లిస్ విఫలమైందన్నారు. మలక్‌పేట గంజ్‌లో అగర్వాల సమాజ్ వారు సురేందర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలిపారు. బీజేపీ గెలుపు కోసం కృషి చేస్తామని సమాజ్ ప్రెసిడెంట్ పంకజ్ సంగీత్ అన్నారు. ప్రచారంలో డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, దేవేందర్, విజయ్‌కాంత్, జెక్కా మోహన్‌రెడ్డి, అంబాబాయి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌దే విజయం

పార్టీ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి



అజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న తీగల కృష్ణారెడ్డి

చాదర్‌ఘాట్: తెలంగాణ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఆదరణతో మలక్‌పేటలో బీఆర్‌ఎస్ పార్టీ విజయం ఖాయమని పార్టీ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఆయన బంధువు, మాజీ మే యర్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత తీగల కృష్ణారెడ్డి పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రచారంలో ప్రజల మద్దతు చూస్తే ఈసారి మలక్‌పేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ విజయం సునాయాసమని అర్థమౌతున్నదని అన్నారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు కామేష్, నర్సింగ్, సుదర్శన్, వెంకటేష్, భువనేశ్వరి పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌లో బీఆర్‌ఎస్‌దే విజయం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



వాకర్స్‌ను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు పరిష్కరించి అభివృద్ధిలో ముందుంచానని, ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం వనస్థలిపురం డివిజన్ బాంబు ట్రీ పార్క్‌లో, మన్సూరాబాద్ డివిజన్ సహారా వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొన్ని వేల కోట్లతో నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించి ప్రజల కష్టాలను తీర్చామని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని తెలిపారు. ఇతర పార్టీలు ఇస్తున్న హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. అన్ని వర్గాలకు ప్రభుత్వం సమన్యాయం కల్పించిందని, అందరికీ సంక్షేమ పథకాలను అందజేసి వారి అభివృద్ధికి కృషి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ప్రజలకు మరింత లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో మరికొన్ని సంక్షేమ పథకాలను అందజేయడానికి కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పదవుల కోసం రాజకీయాలు చేసే వారిని ప్రజలు దూరం పెట్టాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్న వారికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న బీఆర్‌ఎస్‌కు మరోసారి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఎల్‌బీనగర్‌లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తనకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, నాయకులు ఈశ్వరమ్మ యాదవ్, కుంట్లూర్ వెంకటేశ్‌గౌడ్, జక్కిడి మల్లారెడ్డి, టంగుటూరి నాగరాజు, జగదీశ్‌యాదవ్, రఘువీర్‌రెడ్డి, రాంకోఠి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి: రామ్మోహన్‌గౌడ్

హయత్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిలో ఎల్‌బీనగర్ ముందంజలో ఉందని, గత తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు ఓటెయ్యాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎల్బీనగర్ అభ్యర్థి సుధీర్‌రెడ్డికి మద్దతుగా ఆదివారం ఆయన పార్టీ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్‌తో కలిసి హయత్‌నగర్ డివిజన్‌లోని రంగనాయకులగుట్ట, అంబేడ్కర్‌నగర్, ఆంధ్రాబ్యాంక్ కాలనీ, బంజారా కాలనీ తదితర కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు నక్క రవీందర్ గౌడ్, భాస్కర్ సాగర్, గుడాల మల్లేష్, గుత్తా లక్ష్మారెడ్డి, స్కైలాబ్, విజయలక్ష్మి, ఉమాయాదవ తదితరులు పాల్గొన్నారు.



సుధీర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న రామ్మోహన్‌గౌడ్

ఉచితంగా బియ్యం ఇస్తున్న మోదీ కావాలా? రేషన్ కార్డు ఇవ్వని కేసీఆర్ కావాలా?

- బీజేపీ ఎల్‌బీ నగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి



ప్రచారంలో సామ రంగారెడ్డికి మంగళహారతి ఇస్తున్న మహిళలు

మన్సూరాబాద్/హస్తినాపురం: పేదలందరికీ ఉచితంగా బియ్యాన్ని ఇస్తున్న ప్రధాని నరేంద్రమోదీ కావాలో... అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వని సీఎం కేసీఆర్ కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి అన్నారు. తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షుడు బొమ్మ రఘురామ్‌నేత ఆధ్వర్యంలో సామ రంగారెడ్డికి మద్దతు ప్రకటిస్తూ ఆదివారం ఎల్‌బీనగర్‌లో సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమావేశానికి హాజరైన సామ రంగారెడ్డి మాట్లాడుతూ, బీజేపీ బీసీ, దళితుల పక్షపాతి అని, అందుకే తెలంగాణ రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిందన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ బీఆర్‌ఎస్‌గా మారిపోయినా, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పార్టీ మారినా...ఎల్‌బీనగర్‌లోని పేదల బతుకుల్లో మాత్రం మార్పు జరగలేదని విమర్శించారు. గత 16 ఏళ్లుగా ప్రజాసేవలో ఉండి, నాకు తోచిన విధంగా సహాయం చేస్తున్నానని, ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని ఎల్‌బీనగర్ ప్రజలను రంగారెడ్డి కోరారు. అనంతరం బీఆర్‌ఎస్ బీసీ యూత్‌వింగ్ నేత క్రాంతి యాదవ్, మాజీ వార్డు సభ్యుడు అమరజీల నేతృత్వంలో పలువురు బీజేపీలో చేరారు.

- మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆదివారం చంద్రపురికాలనీ, సెంట్రల్‌బ్యాంక్ కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి సామ రంగారెడ్డి కమలంపువ్వు గుర్తుకు ఓటేయ్యాలని కోరారు.
- ఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సచివాలయ నగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించి బీజేపీకి ఓటు వేయాని కోరారు.
- చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి దుర్గానగర్, మాధవనగర్, డిఫెన్స్‌కాలనీలలో సామ రంగారెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

రాజు వేషంలో వింత ప్రచారం



గుర్రంపై ప్రచారం చేస్తున్న వసంతరాయులు

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న వీరభోగ వసంత రాయులు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. రాజు వేషధారణలో గుర్రంపై తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. గతంలో కూడా వసంత రాయులు ఒంటె, గుర్రాలపై వెళ్లి నామినేషన్లు వేశారు. ఇతని వినూత్న ప్రచారం ప్రజలను ఆకట్టుకుంటోంది.

80 ఏళ్లు దాటిన వారు ఇంటి నుంచే ఓటు వేసేందుకు చర్యలు

ఎల్‌బీనగర్: 80 సంవత్సరాలు దాటిన వారు ఇంటి నుంచే ఓటు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎన్నికల అధికారులు తెలిపారు. ఇప్పటికే నియోజక వర్గంలో 80 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, వికలాంగులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు 12డీ ఫారాలను పంపిణీ చేశారు. వాటిని స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన ఎన్నికల సిబ్బందితో ఆదివారం ఎన్నికల అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, 12డీ ఫారంలను స్వీకరించేందుకూ 47 టీంలను ఏర్పాటు చేశామన్నారు.

ఈ అవకాశాన్ని వయోవృద్ధులు, వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొని వారికి అవగాహన కలిపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ రవీందర్‌కుమార్, ఏఆర్‌లు సునీత, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీకి ఓటు వేసి అందెలను గెలిపించాలి



కందుకూరు చౌరస్తాలో ప్రచారం చేస్తున్న గోవా ఎమ్మెల్యే కేదార్‌నాయక్, బీజేపీ నాయకులు

- బీజేపీ గోవా ఎమ్మెల్యే కేదార్‌నాయక్

కందుకూరు: కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌ను గెలిపించాలని గోవా ఎమ్మెల్యే కేదార్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు అనేగౌని అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బీజేపీకి పట్టం కట్టాలని, పార్టీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రిని చేస్తారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే విద్యాశాఖ మంత్రిగా ఉండి విద్యార్థుల సమస్యలు తీర్చలేకపోయారని, సొంత నియోజకవర్గంలో విద్యార్థులకు సరైన బస్సు సౌకర్యం కల్పించలేకపోయారని విమర్శించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి టి.లక్ష్మణ్‌ముదిరాజ్, ఎంపీపీ మంద జ్యోతిపాండు, సర్పంచులు సాధ మల్లారెడ్డి, వసంతకృష్ణగౌడ్, గౌర ప్రభాకర్, ఎంపీటీసీలు ఎస్.ఎల్లారెడ్డి, బక్క మల్లేష్, బాల్‌రాజ్, మాజీ జెడ్పీటీసీ లతాబాబురావు పాల్గొన్నారు.

రావిర్యాలలో...

తుక్కుగూడ: బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి, ర్యాలీ తీశారు. పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, మున్సిపల్ చైర్మన్ మధు మోహన్, కౌన్సిలర్లు శివకుమార్, బి.యాదగిరిరెడ్డి, మౌనిక, అనిత పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనే రాష్ట్రానికి శ్రీరామ రక్ష



మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన నాయకులు

- బీఆర్‌ఎస్ మహేశ్వరం అభ్యర్థి, మంత్రి సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ హరిపురి కాలనీకి చెందిన దాదాపు 100 మంది మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే కారు గుర్తుపై ఓటు వేసి తనను మరోసారి గెలిపించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు గొడుగు శ్రీనివాస్, పార్టీలో చేరిన బాబాగౌడ్, సాగర్, అనిల్, మహ్మద్ అజీమ్, మహమ్మద్ హజారుద్దీన్, అబ్దుల్ నాది, యూసుఫ్ పాషా, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజస్థానీ సమాజ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా...

మహేశ్వరం: మహేశ్వరంలో నివాసం ఉంటున్న రాజస్థానీ సమాజ్, మార్వాడీల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. శనివారం రాత్రి మహేశ్వరం మండల కేంద్రంలోని పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన రాజస్థానీ, ఛత్రియ సమాజ్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొన్నారు. మహేశ్వరంలో ఉంటున్న రాజస్థానీ, ఛత్రియ సమాజ్, మర్వాడీల సంక్షేమానికి తమవంతు కృషి చేస్తానన్నారు. ఎన్నికల అనంతరం సమాజ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తానని అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మరోసారి ఆదరించండి..

తుక్కుగూడ : తనను మరోసారి ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని మంత్రి సబితాఇంద్రారెడ్డి కోరారు. ఆదివారం ఆమె తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని దేవేందర్‌నగర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, నాయకులు బోధ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

దిల్‌సుఖ్‌నగర్: ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. తన మాతృమూర్తి అమృత షష్ఠిపూర్తి జన్మదిన వేడుకలను ఆర్‌కేపురం డివిజన్‌లోని అనాథ విద్యార్థి గృహంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి, వారికి ఫ్రూట్స్, స్వీట్స్ అందచేసి విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ , చంద్రశేఖర్ నాన్న నరహరి, తమ్ముడు అరవింద్, బంధువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత వ్యతిరేకిని ఓడిస్తాం

తెలంగాణ దళిత సమైక్య వేదిక

సైదాబాద్: ఆధునికత సంతరించుకున్న ప్రస్తుత రోజుల్లో కూడా కులం పేరుతో దూషించడం, ద్వేషించడం క్షమించరాని అంశమని తెలంగాణ దళిత సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య అన్నారు. ఆదివారం సైదాబాద్ డివిజన్ జయానగర్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మలక్‌పేట బీజేపీ అభ్యర్థి గతంలో స్థానిక ఆలయ నిర్మాణం వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న లక్ష్మయ్య అనే దళితుడ్ని బెదిరించారని తెలిపారు. అంతే కాకుండా అతడిని కులం పేరుతో దూషిస్తూ దుర్భాషలాడాడని అన్నారు. ఇక్కడి ఆలయ నిర్మాణాన్ని కూడా ఎన్నోసార్లు అడ్డుకున్నాడని అన్నారు. ఆలయ నిర్మాణాన్ని అడ్డుకున్న, దళిత వ్యతిరేకి అయిన వ్యక్తిని అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిస్తామన్నారు.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం



కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న మధుయాష్కీ గౌడ్



కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తూ తీర్మాన పత్రాన్ని మధుయాష్కీకి అందజేస్తున్న ఉద్యమకారులు

లింగోజిగూడ: ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్‌కు మంచి ఆధరణ లభిస్తోందని, ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎంపీ, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నాగోలు డివిజన్ పరిధిలోని బ్లైండ్స్ కాలనీ, జైపురి కాలనీకి చెందిన యువకులు, పలు పార్టీల నాయకులు టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మధుయాష్కీ గౌడ్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్‌ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, వారిని సాగనంపే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్‌రెడ్డి, మంజులా రెడ్డి, చిరంజీవి, నవీన్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల మద్దతు కాంగ్రెస్‌కే: మధుయాష్కీ

తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతూ ఆదివారం తీర్మాన పత్రాన్ని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ రామగిరి ప్రకాశ్, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ నాగరాజు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీకి ప్రజలు రుణపడి ఉంటారని తెలిపారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల న్యాయం జరగాలేదని ఆరోపించారు. ప్రజల సంక్షేమం కోసం మొదటి నుంచి ఉద్యమకారులు పోరాడుతున్నారని, రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ పార్టీనేనని తెలిపారు. కాంగ్రెస్‌తో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కోఆర్డినేటర్ గుర్జని వెంకటేష్‌గౌడ్, అంతటి ధనంజయగౌడ్, పల్లే వినయ్‌కుమార్, కొత్త రవి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపును ఎవ్వరూ ఆపలేరు

పార్టీ మహేశ్వరం అభ్యర్థి కేఎల్లార్

మహేశ్వరం: మహేశ్వరంలో కాంగ్రెస్ గెలుపును ఎవ్వరూ ఆపలేరనిఆ పార్టీ మహేశ్వరం ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ సీనియర్ నాయకులు శివ యాదవ్ ఆధ్వర్యంలో కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తాను గెలుస్తున్నానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హస్తం గుర్తుపై గెలిచి మంత్రి పదవి కోసం కన్నతల్లిలాంటి కాంగ్రెస్ పార్టీని మోసం చేసి బీఆర్‌ఎస్‌లో చేరిన సబితారెడ్డి, కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే బీజేపీలను చిత్తుగా ఓడిస్తామన్నారు.

కేఎల్లార్‌కు మద్దతుగా ప్రచారం..

మహేశ్వరం గడ్డపైన కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు అమీర్‌పేట్, కోళ్లపడకల్, నందుపల్లి గ్రామాల్లో కేఎల్లార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు.



కేఎల్లార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మెహబ్బత్‌నగర్ నాయకులు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి...

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు దేవ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీ, శ్రీ కృష్ణనగర్ కాలనీలలో కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. నాయకులు ధనరాజ్ గౌడ్, రమేష్, భూపాల్ రెడ్డి, సీపీఐ నాయకులు నరసింహ, యాదయ్య, రాములు పాల్గొన్నారు.



ఆర్‌కేపురంలో కేఎల్లార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకురాలు హర్షలత

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారం రాగానే ఆరు గ్యారంటీ పథకాలను వంద రోజుల్లో అమలు చేసి తీరుతామని ఆర్‌కేపురం డివిజన్ సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు తమలపాకుల హర్షలత అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కిచెన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆర్‌కేపురం డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శకుంతల, శిరీష చౌదరి, నిర్మలా రెడ్డి, నీలిమ, ఉషారాణి పాల్గొన్నారు.